www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 25 జూన్ 2024



పిహెచ్‌డి ప్రవేశాలకు ఇంటర్వ్యూలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఏపిఆర్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు పిహెచ్‌డి ప్రవేశ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా సోమవారం మొదలైంది. అందులో భాగంగా కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో తొలిరోజు ఫైన్ ఆర్ట్స్, మెడిసినల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్‌ను ఆహ్వానించి ఇంటర్వ్యూలను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ విసి ఆచార్య చింతా సుధాకర్ మార్గదర్శకం మేరకు ఇంటర్వ్యూలో ఏర్పాట్లు పూర్తిచేసి నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 25న మ్యాథమెటిక్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులకు, 26వ తేదిన మ్యాథమెటిక్స్, 27వ తేదిన సైకాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. విద్యార్థులు రిసెర్చ్ ప్రపోజల్ తో పాటు అన్ని రకాల అర్హత పత్రాలతో ఆయా తేదీలలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

సా..గుతున్న ఖరీఫ్!



3.10 శాతమే సాగు
5,760 ఎకరాల్లోనే విత్తనం
అధికంగా 3,670 ఎకరాల్లో పత్తి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఖరీఫ్-2024 సీజన్ సా..గుతోంది. జూన్ మొదటి వారం నుంచి నైరుతి పవనం మొండికేసింది. ఫలితంగా సాగులో స్తబ్దత నెలకొంది. జిల్లాలో 1.95 లక్షల ఎకరాల్లో సాగు ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లాలోని 36 మండలాల పరిధిలోని సాగు లెక్కలను పరిశీలిస్తే 5,760 ఎకరాల్లో విత్తనం పడినట్లు తేలింది. 1.89 లక్షల ఎకరాలలో విత్తనం పడలేదని తెలుస్తోంది. 96.90 శాతం విస్తీర్ణంలో విత్తనం పడాల్సి ఉంది. రాష్ట్రప్రభుత్వం గండికోట, కెసికి సైతం నీటిని విడుదల చేసే అవకాశాల నేపథ్యంలో సాగు ఊపందుకుంటుంది. ఏదేమైనా ఖరీఫ్ లక్ష్యాన్ని ఆలస్యంగానైనా అందుకుంటుందా అనే సందేహం కలుగుతోంది. 2023 సంవత్సరంలో ఇదే సమయానికి సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో పంట లు సాగయ్యాయి. అప్పటి సాగుతో పోలిస్తే 50 శాతం కూడా సాగుకు నోచుకోక పోవడం గమనార్హం. కడప-కర్నూలు కాల్వకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో 92 వేల ఎకరాల్లో వరి సాగు ఊపందుకునే అవకాశం ఉందనే అంచనాలో వ్యవసాయశాఖ నిమగ్నమైంది. దీంతో జిల్లా వ్యాప్తంగా వరి, పత్తి, వేరుశనగ ఇతర పంటల సాగు ఊపందుకునే అవకాశాలు ఉన్నాయనే అంచనా వేసుకుంటోంది.

వర్షపాతం...ఆందోళనకరం

జిల్లాలో జూన్‌లో 68.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి నైరుతి ఆశావహం కారణంగా 137 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా ఒకే తరహా వర్షపాతం నమోదు గాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో ఆశావహమైన వర్ష పాతం నమోదైతే విత్తనానికి అను కూల వాతావరణం ఏర్పడు తుంది. ఫలితంగా ఖరీఫ్ సీజన్ ఊపందుకునే అవకాశం ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఒకేతరహా వర్షపాతం నమోదు గాని నేపథ్యంలో వ్యవసాయ బోర్ల కింద మాత్రమే పంటల సాగు నడుస్తోంది. మెట్ట ప్రాంతాల్లో విత్తనం విత్తడానికి అవకాశం లేకుండా పోయింది.

వరుణుడు కరుణించేనా!

జూన్‌లో 68.2 మి.మీ, జులైలో 96.7 మి.మీ, ఆగస్టులో 118.4. మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. జూన్‌లో నేటికి 54.56 శాతం నమోదు కావాల్సి ఉండగా 137.6 మి.మీ సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లా రైతాంగం సాగుకు సన్నద్ధమైంది. ప్రస్తుతం అల్పపీడన వాతా వరణం కొనసా గుతున్న నేపథ్యంలో కురుస్తున్న అడపాదడపా వర్షాలకు రైతాంగం ఆశాభావంతో ముందుకు కదులుతోంది. జులైలో నైరుతి ఏమేరకు సహకరిస్తుందనే అంశంపై ఖరీఫ్ సాగు ఆధారపడి ఉందని చెప్పవచ్చు.

ఆశావహంగా పత్తి

ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా పత్తి సాగవుతోంది. 3,670 ఎకరాల్లో విత్తనం పడింది. 760 ఎకరాల్లో మినుము, 1,015 ఎకరాల్లో వేరుశనగ, 209 ఎకరాల్లో వరి విత్తనం పడింది. జిల్లాలోని ప్రధాన ఆహార పంటల్లో మినుములు 837 ఎకరాల్లో, 1,984 ఎకరాల్లో విత్తనం పడాల్సి ఉంది. 59,516 ఎకరాల్లో పత్తి సాగు కావాల్సి ఉండగా 3,670 ఎకరాల్లోనే పడినట్లు తెలుస్తోంది. ఇతర పంటల సాగును పరిశీలిస్తే మొక్కజొన్న 1,407 ఎకరాల్లో చేయాల్సి ఉండగా 60 ఎకరాల్లో సాగుకు నోచుకుంది. 16,901 ఎకరాల పప్పుదినుసుల సాగులో మినుములు 8,528 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 760 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం. ఆయిల్ సీడ్స్ వివరాలను పరిశీలిస్తే 22 వేల ఎకరాల్లో సాగు గానూ ప్రొద్దుతిరుగుడు 1,029 ఎకరాల్లో సాగు కావడం ఆందోళన కలిగిస్తోంది.

లక్ష్యాన్ని అందుకుంటాం

ఖరీఫ్-2024 లక్ష్యాన్ని అందుకుంటాం. సాగుకు మరో రెండు నెలల వ్యవధి ఉన్న నేపథ్యంలో ఆశావహ వర్షపాత సూచనల నేపథ్యంలో సాగు లక్ష్యాన్ని అందుకుంటాం. కెసి ప్రాంతాల్లో 92 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. వరి గణనీయంగా సాగుకు అవకాశం ఉంది.

- నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కడప

మంచిరోజులొస్తాయి..భయపడొద్దు

కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందాం
మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్



ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న జగన్



ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మంచి రోజులు వస్తాయని, ఎవరు భయపడకూడదని కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి అన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులతో మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మనం చేసిన మంచి ఉంది, మనపట్ల ప్రజలకు విశ్వాసం ఉంది, మళ్లీ ప్రజల్లో వస్తాని, భవిష్యత్ మనదేనని వైసిపి శ్రేణులకు జగన్ ధైర్యం చెప్పారు. వైసిపికి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ నేతలతో కూడా చర్చించారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దు. పార్టీ అండగా ఉంటుందని, అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వివరించారు. రానున్న కాలంలో ప్రతి కార్యకర్తకు తనతో పాటు వైసిపి తోడుగా ఉంటుందని జగన్ భరోసానిచ్చారు. నిరంతరం ప్రజాశ్రేయస్సుకు అనుగుణంగా అడుగులు వేయాలని శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాయచోటి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, కడప మేయర్ సురేష్ బాబు, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్.అభిషేక్‌రెడ్డి, జిల్లా, నియోజక వర్గంలోని ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఆప్యాయంగా పలకరింపు

జగన్ కలిసేందుకు జిల్లా వ్యాపంగా జనం తరలివచ్చారు. ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి వినతులను స్వీకరించారు. పులివెందులకు భారీగా తరలివచ్చిన వైసిపి శ్రేణులను ఓపికతో పలకరించి సమస్యలు తెలుసుకున్నారు. ధైర్యంగా ముందుకు వెళ్లాలని భరోసా ఇచ్చారు. పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది.

ముగిసిన జగన్ పర్యటన

మాజీ ముఖ్యమంత్రిగా పులివెందులకు వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి మూడు రోజులపాటు వైసిపి శ్రేణులు, అభిమానులతో ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి వినతులను స్వీకరించారు. జగన్ కలిసేందుకు మూడు రోజులపాటు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. సోమవారం మధ్యాహ్నం వరకు ప్రజాదర్బార్ నిర్వహించిన జగన్ మోహన్‌రెడ్డి ఆయన సతీమణి భారతి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా బెంగళూరులోని వారి నివాసానికి చేరుకున్నారు.

ముఖ్య నాయకులపై ఆగ్రహం

వైసిపి ముఖ్య నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వైసిపి నియోజకవర్గం అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశామని, కాని పార్టీ కోసం కష్ట పడిన వారికి కాకుండా వేరే వారికి పనులు కట్ట బెట్టారని పలువురు ఆరోపించడంతో దీనిపై ముఖ్య నేతలను మందలించినట్టు తెలుస్తుంది. వందల కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉంటే ఎందుకు తన దృష్టికి తీసుకు రాలేదని ఆ నేతలపై అసహనం వ్యక్తం చేశారు.



ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

నీట్ ఫలితాలపై
సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

నీట్ పరీక్ష 2024 ఫలితాలు నీట్ పరీక్ష నిర్వహణపై విద్యార్థులు తల్లిదండ్రులు నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నందున నీట్ పరీక్ష నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ నిర్వహించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం కడపలో ఆర్ట్స్ జూనియర్ కళాశాలలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ మాట్లాడుతూ దేశం మొత్తం నీట్ పరీక్షలో జరిగిన అక్ర మాలపై గల వ్యక్తి స్పందిస్తుంటే కానీ రాష్ట్రంలో దానికి భిన్నంగా అధికార టిడిపి, జనసేన, ప్రతిపక్ష వైసిపి పార్టీ ఏమాత్రం నోరు మెదపకపోవడం దారుణం అన్నారు. నీట్ పరీక్ష నిర్వహణపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా అర్థం అవుతుంది అన్నారు. 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నందున పారదర్శకత పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని పేర్కొన్నారు. నీట్ పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రం ఉన్న ఒకే సీరియల్ నెంబర్లతో కూడిన ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. నీట్ పరీక్ష రద్దుచేసి అక్రమాలకు పాల్పడ్డ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, అంజి,వినయ్,చరణ్ పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ జి, శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఒక సంయుక్త ప్రకట నలో తెలిపారు. పూర్తి సమాచారం కోసం 08562-258622, 244622 నంబర్లకు ఫోన్ ద్వారా కానీ, kadapa.dcourts.gov.in, dlsakdp@ gmail.com ఈమెయిల్ అడ్రస్‌కు కానీ సంప్రదించవచ్చున్నారు.

ప్రొద్దుటూరులో దారుణ హత్య

ఆస్తికోసమే హత్య చేసినట్లు పలు అనుమానాలు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు/పుట్టపర్తి సర్కిల్



మహేశ్వరరెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలో ఆదివారం రాత్రి సోమవారం తెల్లవారు ఝామున మధ్య వెంకట మహేశ్వరరెడ్డి(23) దారుణ హత్యకు గురయ్యాడు. భూమిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ హత్యకు పాల్పడినట్లు సమాచారం. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహేశ్వరరెడ్డి తల్లి నాగరత్నమ్మ రామచంద్రారెడ్డి 20 సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నారు. నాగరత్నమ్మకు తాళి కట్టిన భర్త ఏమయ్యాడనేది ఎవ్వరికీ తెలియదు. నాగరత్నమ్మ, రాంచంద్రారెడ్డి, హతుడు మహేశ్వరరెడ్డి ఒకే ఇంట్లో కాపురం ఉంటూ స్వీట్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. డబ్బుల కోసమని ఆదివారం రాత్రి రామచంద్రారెడ్డికి మహేశ్వరరెడ్డి మధ్య గొడవ జరిగినట్లు నాగరత్నమ్మ తెలిపారు. ఆమె ఉబకాయంతో ఇబ్బంది పడుతుండడం వల్ల రోజూ మందులు వాడుతున్నానని ఈ మందుల వల్ల తనకు మత్తుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కారణంగా రాత్రి తన గదిలోనికి వెళ్లి పడుకున్నానని నాగరత్నమ్మ తెలిపారు. తెల్లవారి చూసేటప్పటికీ ఇళ్లంతా రక్తమయంగా ఉందని రామచంద్రారెడ్డి ఒక గోనె సంచిలో ఏదో తీసుకెళ్తూ కనిపించగా ఏంటని అడగ్గా పాతసామాన్ల మూట అని బదులిచ్చాడని తెలిపారు. అనంతరం తాను ఇంట లోపలికెళ్లి చూడగా హత్య జరిగిన విషయం బయటపడిందని తెలిపారు. మహేశ్వరరెడ్డి శరీరాన్ని రెండు, మూడు ముక్కలుగా చేసి ప్రొద్దుటూరు శివారు ప్రాంతంలో వేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నాగరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తున్నామని డిఎస్‌పి మురళీధర్ తెలిపారు.

సామాజిక పెన్షన్ల పెంపుదలకు గ్రీన్‌సిగ్నల్!

జిల్లాలో వెయ్యి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఛాన్స్
అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు ఓకే
రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సామాజిక పింఛన్ల పెంపుదల సహా ఐదు హామీలకు రాష్ట్ర మంత్రి మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సోమవారం మంత్రి మండలి సమావేశంలో ఎన్నికల హామీల అమలుకు సంబందించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలోని 2.57 లక్షల మంది 28 రకాల పింఛన్ దారులకు లబ్ధి చేకూరనుంది. గత నెలలో ప్రతి పెన్షన్ దారునికి రూ.3,000 చొప్పున రూ.70 కోట్లు పంపిణీ చేసిన సంగతి తెలిసింతే. తాజా మంత్రి మండలి సమావేశంలో వృద్ధాప్య పింఛన్లను రూ.నాలుగు వేలకు పెంచడంతో పాటు ఏప్రిల్ నుంచి పెంపుదల హామీ వర్తింపజేయనున్నట్లు ప్రకటించిన మేరకు అదనంగా రూ.వెయ్యి చొప్పున కలిపి జులైన ఒకటిన ప్రతి వృద్ధాప్య పెన్షన్ దారునికి పంపిణీ చేయనున్నారు. 16,347 మెగాడిఎస్సీ హామీ అమలు పేరుతో నిరుద్యోగుల ఆకట్టుకున్నారు. జిల్లాలోని గత ఖాళీలు సహా ఇటీవలి కాలంలో రిటైర్డు ఖాళీలతో కలిపి లెక్కిస్తే సుమారు 1000పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించడం అన్నార్థులకు ఉపశమనం లభించినట్లేనని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో స్కిల్‌గణన, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు వంటి నిర్ణయాలను ఆమోదించినట్లు తెలుస్తోంది. ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్ రద్దు కానుండడంతో రైతాంగానికి ఉపశమనం లభించినట్లు కనిపిస్తోంది. ఏదేమైనా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన తొలి కేబినెట్ బేటీలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి మొగ్గు చూపించినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచార ంలో, కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధి ఎంతో అనే సంశయం అమలు తీరును బట్టి తేలిపోనుందని చెప్పవచ్చు.

పెట్టుబడి సాయం రూ.20 వేలు జమ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాలో జమ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి కోరారు. సోమవారం కడప కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డిఆర్ఒ గంగాధర గౌడ్‌కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ టిడిపి కూటమి మెజార్టీతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు తోడు సూపర్ సిక్స్ పేరుతో కూటమి ఇచ్చిన హామీలను కూడా పెద్ద ఎత్తున ప్రభావం చూపాయని తెలిపారు. గత ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావంతో ఒకవైపు కరువు, మరోవైపు డిసెంబర్‌లో వచ్చిన తుపాన్ తో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని చెప్పారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, ఎరువులు, విత్తనాల కోసం ఈ ఖరీఫ్‌లో వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతాంగం తీవ్రంగా ఇబ్బందులు పడుతుందని అన్నారు. వడ్డీ రాయితీ విడుదల చేసి రైతుల ఖాతాలో వేయాలని, ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రకటించిన పెట్టుబడి సహాయం కింద ఇస్తామన్న రూ.20 వేలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, నాయకులు చిన్న సిద్దయ్య, రంగారెడ్డి పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో డిప్లమా ఓరియంటేషన్ డే

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : రాయచోటిలో రింగ్‌రోడ్‌లో ఉన్న అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లమా మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఓరియ ంటేషన్ సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మా ట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు క్రమ శిక్షణతో పాటు విలువలతో కూడిన విద్యను అంది స్తున్నామన్నారు. నేటి పోటీ ప్రపంచంలో సాంకే తికత విద్యను అంది పుచ్చుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి డిప్లమా కోర్సు ఒక వారధి లాగా ఉపయోగపడుతుందని తెలియ జేశారు. విద్యార్థులు కష్టపడి తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పేర్కొ న్నారు. కార్యక్రమంలో డిప్లమా ఇన్‌ఛార్జి మురళీమోహన్ నాయక్, కళాశాల విభాగాధిపతుల అధ్యా పకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - బద్వేలు : తిరుమల ట్రస్ట్ వారి సహకారంతో బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని కోటిరెడ్డి నగర్ ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని పాఠశాల హెచ్ఎం సింగన ఓబుల్ రెడ్డి, పి.విశ్వనాథరెడ్డి యు. నరేంద్ర కుమార్, ఆధ్వర్యంలో అందజేశారు. సోమవారం బద్వేల్ అర్బన్ సిఐ యుగంధర్, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి. సుబ్బారావు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్ చేతుల మీదుగా సామగ్రిని వితరణ చేశారు. అనంతరం విద్యార్థులకు వారు విద్యాభివృద్ధిపై పలు రకాల సలహాలు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో బ్రహ్మ దేవుని యర్రం రెడ్డి, పబ్బతి సత్యనారాయణ పాల్గొన్నారు.

చెస్ టోర్నీలో రాణించిన చిన్నారి అమీనా

ప్రజాశక్తి - కడప : చెన్నై నగరంలోని రాయపేట ప్రాంతంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫీడే రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన చిన్నారి అమీనా అండర్-8 బాలికల విభాగంలో మంచి ప్రతిభ కనబరిచి తొమ్మిదవ స్థానాన్ని దక్కించుకుంది.కడప జిల్లాకు చెందిన మరో సీనియర్ క్రీడాకారుని ఉమాదేవి 55+ మహిళ విభాగంలో ప్రతిభ ఘనపరిచి ప్రత్యేక బహుమతిని అందుకుంది. చెన్నై రోటరీ క్లబ్, వైఎంసిఎ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో దాదాపు 650 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కనీస అవసరాలపై దృష్టి సారించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వల్లూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

ప్రజలకు కనీస అవసరాలైన తాగునీరు, విద్య, వైద్యం అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. ప్రజలు అధికారి దగ్గరికి సమస్యలతో వచ్చినప్పుడు వెంటనే సమస్యలు పరిష్కరించినప్పుడే వారికి ప్రభుత్వం పై మంచి అభిప్రాయం ఏర్పడుతుందని అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యక్షులు గంగయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా మండల అధికారులు , వారి శాఖలకు సంబంధించి అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు కనీస సౌకర్యాల కల్పనలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో అందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రెవెన్యూ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలకు వచ్చిన ప్రజలను ఇబ్బందులకు గురి కాకుండా సకాలంలో అందజేసేలా అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, తహశీల్దార్, ఇఒపిఆర్‌డి, టిడిపి మండల అధ్యక్షులు లేబాక నాగేశ్వర్ రెడ్డి, పుత్త సాయి నర్సింహారెడ్డి, మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఓం శాంతి సేవా కేంద్రంలో మాతేశ్వరి జగదాంబ సరస్వతి పుణ్య స్మృతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సోమవారం రాజయోగిని బ్రహ్మకుమారి గీత దీది, ఈశ్వరి అక్కయ్య, ప్రదీప్ అక్కయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్ఞాన యజ్ఞాన్ని ప్రపంచానికి చాటారని తెలిపారు. ప్రతి ఒక్కరు ధ్యానం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓంశాంతి అక్కయ్యలు, అన్నయ్యలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో సిపిఆర్‌పై శిక్షణ

ప్రజాశక్తి - కడప సిటీ



సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో సిపిఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కడప ఎయిర్‌పోర్టు సిబ్బంది, అగ్నిమాపక దళం, ఇండిగో, ఇండిగో ఎయిర్‌లైన్స్ సిబ్బందితో సహా సుమారు 40 మందికి శిక్షణ ఇచ్చారు. వైద్య కళాశాల వైద్యులు డాక్టర్ వర సుబ్రహ్మణ్యం, డాక్టర్ వంశీ బోధకులుగా వ్యవహరించారు. శిక్షణ కార్యక్రమాని కడప ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులు డాక్టర్. వర సుబ్రహ్మణ్యం, డాక్టర్ వంశీ బోధకులుగా ఉన్నారు. తమకు సిపిఆర్‌పై అవగాహన కల్పించేందుకు అవకాశం ఇచ్చిన డిఎంహెచ్ఒ నాగరాజుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి శిక్షణకు అన్ని సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ వి. విజయ్ రామ రాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమానికి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డిఆర్ఒ గంగాధర్‌గౌడ్, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ చంద్రమోహన్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచించారు. వైఎస్ఆర్ జిల్లాను డయేరియా రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులందరూ కృషి చేయాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

ఎన్‌డిఎ ప్రభుత్వం బాధ్యత వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నీట్ ప్రశ్నాపత్రం లీకేజీలపై కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం బాధ్యత వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 30 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధ కారం చేశారని తెలిపారు. కేంద్రీకృత అఖిల భారత పరీక్షా ప్రక్రియలను చుట్టుముట్టిన చెడు పరిణామాలపై వెంటనే చర్యలు చేపట్టాలని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఈ కుంభకోణాలపై దర్యాప్తు చేయడానికి సిబిఐ సేవలు వైట్ వాష్‌కు దాని విధానాన్ని నిర్ధారిస్తాయని పేర్కొన్నారు. వృత్తిపరమైన విద్యా సంస్థలలో ప్రవేశాన్ని నియంత్రించడానికి ప్రవేశ పరీక్షలను నిర్వహించాలని తెలిపారు.

అవినీతి తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు : స్థానిక తహశీల్దార్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తిని వెంటనే సస్పెండ్ చేయాలని కెవిపిఎస్ కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 21న మండలంలో చిన్నచిన్న కంపచెట్ల కట్టెలు తోలుకునేందుకు వ్యాపారులకు అనుమతి ఉన్నప్పటికీ పిడుగుపల్లె వద్ద కరెంటు స్తంభాలకు అడ్డంగా ఉన్న కొన్ని మొద్దలను కొట్టి వాటిని లారీలో తీసుకెళుండగా విఆర్ఒ, తహశీల్దార్ అడ్డుకుని రెండు రోజులు వారి ఆధీనంలోనే ఉంచుకున్నారన్నారు. అనంతరం వైసిపి శ్రేణులతో కుమ్మక్కై రూ. 40 వేలను వ్యాపారస్తుల వద్ద నుండి వసూలు చేశారని, ఈ విషయం మండల మంతా కోడై కోస్తుందని పేర్కొన్నారు. అలాగే మేలో చెరువులలో మట్టి తోలుకునేందుకు అనుమతి ఇచ్చి ఒక్కో రైతు వద్ద కొన్ని వందల ట్రిప్పులకు సరిపడ సొమ్మును కనీసం రూ. 20వేల నుండి రూ. 50 వేల వరకు వసూలు చేశారని, ఇప్పటికే సంబంధిత ఆర్‌డిఒకు ఫిర్యాదులు చేశారన్నారు. ఇలా ఒకటి కాదు అనేక చట్ట వ్యతిరేక పనులు చేశారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు, పట్టించుకోకపోవడం చాలా దారుణమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తులను వెంటనే సస్పెండ్ చేసి ప్రజా పాలన కాపాడాలని అన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సుదర్శన్, ఆవాజ్ కమిటీ నాయకులు హుస్సేన్ పీరా, పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం నిర్వహించారు. బాధితులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ క్రైమ్ బారిన పడ్డ బాధితులు ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ అధికారులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్ లైన్ వెబ్ సైట్ www.cybercrime.gov.in ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్ పి) టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయొచ్చని ప్రజలకు సూచించారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ అధికారులు ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నగరపాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నగరపాలక శాఖధిపతులు, సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డయేరియా నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు చైతన్యం చేయాలని శానిటేషన్ విభాగ అధికారులకు ఆదేశించారు. కడప నగరంలో ఎటువంటి కేసులో వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటూ ప్రతి పాఠశాలలో శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న ఎన్ఎంసి బృందం

మెడికల్ కళాశాల వసతులు పరిశీలన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన వైయస్సార్ వైద్య కళాశాలలో ఆస్పత్రి వసతులను ఎన్ఎంసి బృందం సోమవారం పరిశీలించింది. ఎన్ఎంసి బృందంలోని మహేష్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వసతులను పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లేశ్వరి అక్కడ ఉన్న వసతులను వివరించారు. లేబరేటరీ, అత్యవసర విభాగం, ఒపి, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వైఎస్ఆర్ మెడికల్ కళాశాలకు ఇప్పటివరకు అనుమతులు రాలేదు.



గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పిల్లలు

అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సీతారామాంజనేయపురం, కృష్ణాపురం సచివాలయాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో గ్రాడ్యుయేషన్ డే, అంగన్వాడీ ఆహ్వానిస్తోంది వంటి కార్యక్రమాన్ని ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలోని అయిదేళ్లు పైబడిన పిల్లలను పాఠశాలలకు పంపించామన్నారు. మూడేళ్ళు నిండిన చిన్నారులు అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని తల్లులకు సూచించారు. అనంతరం తల్లులకు, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకత, బోధించే విధానం, అంగన్వాడీ ఆహార పోషణ గురించి వివరించారు. పిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ ప్రశాంతి, అంగన్వాడీ కార్యకర్తలు భారతి, ధనలక్ష్మి, అనిత, అనూష, వేదమ్మ, మహాలక్ష్మి, రాజేశ్వరి, ఉష, బాబున్నిసా, తల్లులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న దాతలు

విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు పదవ తరగతిలో మొదటి స్థానంలో వచ్చిన హైదవికి రూ.5,000, రెండవ స్థానంలో వచ్చిన మనోజ్ఞకి రూ.3,000, మూడవస్థానంలో వచ్చిన చరిత రూ.2,000 విద్యార్థుల తల్లిదండ్రులకు విభిన్నప్రతిభావంతుల సంస్థ చైర్మన్ జనార్దన్‌రెడ్డి ఆయన సేవ సంస్థ ద్వారా రూ.10వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో టిడిపి మాజీ పులివెందుల పట్టణాధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డి, వేంపల్లె మండల ఇన్‌ఛార్జి రఘునాథ్‌రెడ్డి, టిడిపి నాయకులు మా బాషా, విశ్వనాథరెడ్డి, శివ మోహన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేరుశనగలు పంపిణీ చేస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

రాయితీతో వేరుశనగ కాయలు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీతో అందించే వేరుశనగ కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి కోరారు. మండలంలోని బొందలకుంట, శెట్టివారిపల్లె, కొర్రపాడు గ్రామ ఆర్బికేల్లో సోమవారం ఎఒ ఆధ్వర్యంలో రాయితీ వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనం వేసే ముందు ట్రైకోడెర్మవిరిడి అనే శిలీంద్రంతో ఒక కిలో విత్తనానికి 8 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. బొందలకుంటలో ఎంపిటిసి వెంకట సుబ్బయ్య చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయడమే తమ ఉద్దేశ్యమన్నారు. **సింహాద్రిపురం :** ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న వేరుశనగ కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు భరోసా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ చరణ్‌తేజ్ పేర్కొన్నారు. మండలంలోని గురిజాలలో సోమవారం రాయితీ వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఆశయంతో రాయితీ విత్తనాలను రైతులకు ఇస్తోందన్నారు. విత్తనాలు పొందిన ప్రతి రైతు తప్పనిసరిగా పొలంలో విత్తనం వేయాలన్నారు. విత్తనం వేసే సమయంలో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మహేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎల్ఐసి కార్యాలయాన్ని ఆధునీకరించడం సంతోషకరం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడపలో ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం ప్రారంభించి 47 సంవత్సరాల అయిందని, డిజిటల్ సేవలు లక్ష్యంగా డివిజనల్ కార్యాలయాన్ని సెంట్రలైజ్డ్ ఎసి సేవలతో ఆధునీకరించుకోవడం సంతోషించదగ్గ విషయమని జోనల్ మేనేజర్లు ఎల్. కె. శ్యామసుందర్, పునీత్ కుమార్ అన్నారు. సోమవారం ఆధునీకరించబడ్డ డివిజనల్ కార్యాలయాన్ని జ్యోతి ప్రజ్వలనంతో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కస్టమర్ల ఆకాంక్షలు పెరిగాయని, వారికి డిజిటల్ సేవలందించే దిశగా పయని స్తున్నామన్నారు. పాలసీదారులతో దృఢమైన బంధం దిశగా జవాబు దారీతనంతో కూడిన సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఏజెంట్స్ రిక్రూట్మెంట్ రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్, ఇంజినీరింగ్ అధికారులు శ్రీనివాస్, సుదర్శన్ రెడ్డి, డివిజనల్ మేనేజర్లు సత్య శ్రీనివాస్, సత్యప్రసాద్, చలపతి, చంద్రకళ సంఘాల నాయకులు ఎల్లారెడ్డి, సంజయ్, రఘునాథరెడ్డి, ఆనందరావు, రెడ్డి భాస్కర్, సుధీకర్, సేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు, ప్రోడక్ట్ మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణ

దుకాణాలు ఏర్పాటు - పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు సర్కిల్ వద్ద ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రభుత్వం గృహ నిర్మాణాలపై సుమారు 15 మంది లబ్ధిదారులకు గతంలో స్థలాలు కేటాయించింది. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో నూతనంగా బైపాస్ రోడ్డును నిర్మించారు. బైపాస్ రోడ్డు పూర్తి అయినప్పటి నుండి పలువురు ప్రధాన రహదారిగా ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి వాణిజ్య కట్టడాలు చేపట్టి వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను పలువురు దర్జాగా ఆక్రమిస్తూ వాణిజ్య నిర్మాణాలు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మరికొందరు ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రార్థనా మందిరం నిర్మాణం చేపట్టారు. అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే నగర పంచాయతీకి ఉన్న కాస్త స్థలాలు కూడా ఆక్రమణలకు గురై, ప్రభుత్వ స్థలాలు లేకుండా పోతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కడప రోడ్డులో గత వైసిపి ప్రభుత్వంలో నాయకుల అండదండలతో ఒకచోట నాయకుడు తన సొంత స్థలంలో నగర పంచాయతీ అనుమతులు లేకుండా వాణిజ్య సముదాయాన్ని నిర్మించినట్లు సమాచారం. ఆ కారణంగా నగర పంచాయతీకి పన్నుల రూపంలో రావలసిన రాబడికి గండి పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి వాటిపై అధికారులు దృష్టి సారించి నగర పంచాయతీ రాబడిని పెంచేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ప్రభుత్వ స్థలంలో వెలసిన దుకాణాలు

ఇష్టానుసారంగా దాడులు, తప్పుడు కేసులు



మాట్లాడుతున్న జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైసిపి ప్రభుత్వ హయాంలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై ఇష్టానుసారంగా దాడులు చేయించి, తప్పుడు కేసులు నమోదు చేయించారని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. తనపై కూడా అక్రమ కేసులు బనయించడమే కాకుండా, రెండుసార్లు జైలుకు పంపారని తెలిపారు. స్థానిక టిబి రోడ్డులోని టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ఎన్నడూ కడప జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోయాక కడప జిల్లాకు చేరుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాకు ఒక చిన్న పరిశ్రమ కూడా ఆయన హయాంలో తీసుకరాలేదన్నారు. ప్రజా సమస్యలపై నాయకులు అధికార పక్షాన్ని ప్రశ్నిస్తే తప్పులేదని అభిప్రాయపడ్డారు. పోలీసు, పలు శాఖల అధికారులు ఇప్పటికీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు, ఆయన బావమర్ది పాతకోట బంగారు మునిరెడ్డికి వత్తాసు పలుకుతూ, ఇసుక అక్రమ రవాణాలో సహకరిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. అధికారులు తమ తీరు మార్చుకొనకపోతే వారి కార్యాలయాల వద్దకు వచ్చి తానే ప్రశ్నిస్తానని హెచ్చరించారు. ప్రజలకు ఏ ఇబ్బంది ఉన్నా తనను ఏ సమయంలోనైనా కలవవచ్చునని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి దస్తగిరయ్య, పద్మనాభరెడ్డి, కరిముల్లా పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న తహశీల్దార్ భీమేశ్వరరావు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తహశీల్దార్ భీమేశ్వరరావు, ఎంపీడీవో సల్మాన్ రాజ్ పేర్కొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు రెవెన్యూ, వ్యవసాయ ఇతర సమస్యలను పరిష్కార వేదిక దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా భూముల పరిష్కారం, వన్‌బి, అడంగల్ ఇతర సమస్యలకు సంబంధించి అధికారులకు విన్నవించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో పిఆర్ ఎఇ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : గతంలో ఉన్న స్పందన కార్యక్రమాన్ని రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థగా పున: ప్రారంభించింది. సోమవారం నుండి ప్రారంభమైన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో మండల అధికారులు పాల్గొని ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు కడప కలెక్టరేట్ నుండి నిర్వహించిన విసి కార్యక్రమంలో పాల్గొన్నారు. రెవెన్యూ అధికారులు, విద్యాశాఖ, వ్యవసాయ, హౌసింగ్, విద్యుత్, ఆరోగ్య, మండల పరిషత్, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువతి హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు టూ టౌన్ పరిధిలో దాదాపు ఏడేళ్ల క్రితం జరిగిన హైందవి (21) దారుణ హత్య కేసులో నిందితుడు నవీన్ కుమార్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1లక్ష 50 వేలు జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు సెకండ్ ఎ.డి.జె.కోర్టు జడ్జి జి.ఎస్ రమేష్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారని టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం తెలిపారు. స్థానిక గోకుల్ నగర్‌కు చెందిన కడపన జయప్రకాశ్‌రెడ్డి కుమార్తె కడపన హైందవి హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసి ప్రొద్దుటూరులో బ్యాంక్ కోచింగ్ తీసుకుంటూండగా, ఆమె ఇంటి కింద పోర్షన్‌లో నివాసముండే రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామానికి చెందిన చింతకుంట నవీన్‌కుమార్ ఆమెను ఇష్టపడినట్లు, ఆ తర్వాత ముద్దాయి బండి పెట్రోల్ అయిపోగా గమనించిన హైందవి తన బండిలో పోయి పెట్రోల్ పట్టించుకునిరా అని తెలపగా.. నవీన్‌కుమార్ సరే అని హైందవిని వాళ్ల ఇంటిదగ్గర వదిలిపెట్టాడు. ఆ సమయంలో హైందవి ఒక్కతే ఇంటిలో ఉన్నట్లు గమనించిన నవీన్‌కుమార్ ఇదే అదనుగా భావించి హైందవి చేయి పట్టుకుని బలవంతం చేసినట్లు ఆమె ఛీ కొట్టి వదలమని అరువగా.. నవీన్‌కుమార్ భయపడి అక్కడ ఉన్న కత్తి తీసుకొని హైందవి గొంతులో పొడవడంతో ఆమె చనిపోయిందని వివరించారు. ముద్దాయి నవీన్‌కుమార్ హైందవి మెడలోని బంగారు గొలుసు, చెవులకు ఉన్న జూమ్కీ కమ్మలు, సెల్‌ఫోను, స్కూటీ తీసుకొని, స్కూటీని పెట్రోలు బంకు వద్ద వదలి పారిపోయాడని తెలిపారు. జరిమానా కట్టలేని పక్షంలో అదనంగా 6 సంవత్సరాల 9 నెలలు జైలు శిక్ష విధించారని వివరించారు.

రాజీనామా చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



సిఐకి ఫిర్యాదు చేస్తున్న మాజీ వాలంటీర్లు

వాలంటీర్లుగా పని చేస్తున్న తమను గత ఎన్నికల్లో వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి బలవంతంగా రాజీనామా చేయించారని, వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు కోరారు. రాజీనామా చేసిన వాలంటీర్లు సోమవారం నగర పంచాయతీ డిఇ బాల మల్లేష్‌కు, రెవెన్యూ డివిజనల్ పరిపాలనాధికారికి వినతిపత్రంతోపాటు స్థానిక అర్బన్ సీఐ కరుణాకర్‌కు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్నులూరుకు చెందిన 9,10 వార్డులలో పని చేస్తున్న 21 మంది వాలంటీర్లం సంతకాలు చేసి అధికారులకు ఇచ్చామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమపై దయతలిచి విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో గురునాథ్, శ్రావణి, అనూష, బసిరున్, కరిష్మా, సుజాత, భవాని, జమాల్ వలి, ప్రవల్లిక, శ్రీజ్యోతి, గోవింద్, నాగలక్ష్మి, కృష్ణవేణి, మస్తానమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఫిర్యాదు చేయడం తప్పా..?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజా సమస్యలపై పోరాటం చేసే తాను నాణ్యతలేని, కల్తీ, నిషేధిత ఆహార పదార్థాలను అందించి ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్నరని ఫిర్యాదు చేస్తే తనను మానసికంగా హింసిస్తున్నారని రామోజీ ఇమ్మానుయేలు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో జమ్మలమడుగు, ప్రొద్దుటూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో రెస్టారెంట్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫుడ్ మేకింగ్, తినుబండారాలు నడుపుతున్నారని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశానని తెలిపారు. జమ్మలమడుగు పట్టణంలో ఉన్న అభిరుచి రెస్టారెంట్‌పై కూడా ఫిర్యాదు చేశానన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత ఈ సమస్యలపై స్పందించకుండా వారితో కుమ్మక్కై ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఫిర్యాదు చేశానని తెలిపారు. తాను దళితుడననే ఉద్దేశ్యంతో తన ఫిర్యాదు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమేకాక, తనను మానసికంగా, భౌతిక దాడులకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వెంటనే వీరి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

డిఎస్‌పి డాక్టర్ యస్వంత్‌కు అభినందనలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజక వర్గంలో శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించిన డిఎస్‌పి డాక్టర్ యస్వంత్‌కు మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథరెడ్డి అభినందనలు తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో వారు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ మునుపెన్నడూ లేనంతగా సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా జరగడం సంతోషించతగ్గ విష యమన్నారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన డిఎస్‌పి బంగ్లా ఆవరణ అపరిశుభ్రంగా ఉండేది.. అలాంటి దానిని ఇప్పుడు శుభ్రంగా తయారు చేయించడం గర్వించదగ్గ విషయమన్నారు. డిఎస్‌పి టిడి యస్వంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో చిన్న పసుపుల శ్రీనివాసులురెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీనివాసులు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున, మోరగుడి పాండు, మైలవరం రాజారెడ్డి, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.



డిఎస్‌పిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీలు

ఎమ్మెల్యేకు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా 6వసారి గెలిచి చరిత్ర సృష్టించారంటూ నంద్యాల వరదరాజులరెడ్డికి బిసి ప్రజా చైతన్య సమాఖ్య సంఘం నాయకులు ఆత్మీయ సత్కారాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక బిసి సమైక్య కార్యాలయంలో ఈ సత్కారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేసినందుకు బిసి ప్రజాచైతన్య సమాఖ్య నాయకులందరికీ కృతజ్ఞతలు.. కానీ ఇలాంటి సత్కారాలు తనకు ఇష్టం లేదన్నారు. సన్మానాలు సత్కారాలు చేయించుకోవడం వల్ల మనిషికి గర్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమానికి బొర్రా రామాంజనేయులు అధ్యక్షత వహించారు. సమాఖ్య గౌరవ సలహాదారులు డాక్టర్ గురుమూర్తి, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజ్ చైర్మన్ హరి నారాయణ, ఎన్జీవో సంఘం నేత చంద్రమౌళి, సమాఖ్య కోశాధికారి మడక సెంటయ్య, ఉపాధ్యక్షులు వేల్పుల భాస్కర్ యాదవ్, కార్యదర్శులు భాస్కరరావు, జిసి పుల్లయ్య, టీచర్ శీను, బత్తుల శ్రీనివాసులు, చౌడయ్య, పరమేశ్వరరావు, కృష్ణయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని సత్కరిస్తున్న బిసి నాయకులు



మంత్రి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రాంగోపాల్‌రెడ్డి

మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్ర విద్య, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన లోకేష్‌ను కలిసి పుష్ప గుచ్ఛమిచ్చారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గంలోని కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు సమాచారం.

నేడు గండి క్షేత్రంలో బహిరంగ వేలం

ప్రజాశక - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో పూలు విక్రయించుకొనుటకు, టోల్ గేట్ వసూలు చేసుకొనుటకు మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవస్థాన సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందా రెడ్డి, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. జులై నెల ఒకటవ తేదీ నుండి 2025వ సంవత్సరం జూన్ 30వ తేదీ వరకు దేవస్థాన ఆవరణలో పూలు అమ్ముకొనుటకు, దేవస్థాన ఆవరణలో వాహనాలకు టోల్‌గేట్ వసూలు చేసుకొనుటకు రూ.5 లక్షలు చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు. వేలంపాట కన్నా ముందుగా టెండర్ బాక్స్ ఓపెన్ చేసి అందులో వచ్చిన టెండర్లలో హెచ్చు మొత్తం నుండి బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా చెండు మల్లెపూలు, తురక చామంతి పూలు, గన్నేరు పూలు అమ్మకూడదన్నారు. వేలంపాటలో హిందూ మతస్తులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈ వేలం పాటలో పాల్గొని దేవస్థాన అభివృద్ధికి తోడ్పడాలని వారు కోరారు.

రైతులకు ఆర్థిక సాయం అందించాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఆర్థిక సాయం అందించాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి సూచించారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందన్నారు. ఇటీవల ఏరువాక పౌర్ణమి కూడా అయిపోయిందని తెలిపారు. వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయని, రైతులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన సమయం ఇదేనని తెలిపారు. ప్రతి రైతు కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని టిడిపి తన ఎన్నికల మేనిఫెస్టోలో, బాబు ష్యూరిటీలో పెట్టారని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా వెంటనే కేంద్ర ప్రభుత్వం ఏడాదికి ఇచ్చే రూ.6 వేలతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి రైతు కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. కౌలు రైతులను కూడా ఆదుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. చంద్రబాబు ప్రభుత్వం అన్న క్యాంటీన్లును పునరుద్ధరించడం హర్షణీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం ఎక్కువగా ఉందన్నారు.

బోధనపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యా బోధనపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని రూం మెనేజ్‌మెంట్ ట్రైనర్ అజిత్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ఉపాధ్యాయులకు విద్యా బోధనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతులు అనేవి ఉపాధ్యాయులకు చాలా ఉపయోగ పడతాయన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు నేర్పాలని కోరారు. నూతన పద్ధతులతో విద్యార్థులకు విద్యా బోధన చేయాలని సూచించారు. విద్యార్థులతో స్నేహితుల్లా ఉపాధ్యాయులు వ్యవహరించాలని కోరారు. అనంతరం ట్రైనర్ అజిత్‌కుమార్‌ను శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మ కోసం మొక్కను నాటండి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు అమ్మ కోసం ఒక మొక్కను నాటండి అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం నూతన మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు వంగల శశి భూషణ్‌రెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భాను, అసెంబ్లీ కన్వీనర్ మహేష్, సుష్మ, వై.నవీన్, రాజశేఖర్, శ్రీరాములు, లక్ష్మీదేవి, లక్ష్మయ్య, వాజ్‌పేయి, మురళి, టీవీఎస్ భాస్కర్, విష్ణు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సుగుణశ్రీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - దువ్వూరు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ సుగుణశ్రీ సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి, ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలన్నారు. ఆ నీటిని ప్రజలకు అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో నీరు నిలువ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి జి.శివప్రసాద్, ప్రభుత్వ వైద్యాధికారి సురేష్ బాబు, గ్రామీణ తాగునీటి పారుదల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కాపర్ వైరు చోరీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం



దొంగలు కిందపడేసిన ట్రాన్స్‌ఫార్మర్

మండలంలోని బిదనంచర్ల గ్రామ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన గోపాల్ అనే రైతు పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎఇ సుబ్రమణ్యం మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చోరీ గురైన ట్రాన్స్‌ఫార్మర్ విలువ దాదాపు రూ.60వేలు ఉంటుందని తెలిపారు.

వరుస దొంగతనాలతో రైతులు బెంబేలు

ఇటీవల కాలంలో రైతుల పొలాల వద్ద ఉన్న రూములు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు జరుగుతుండడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.